క్లుప్తంగా

ఎంపీపీని కలిసిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ



ఎంపీపీని సత్కరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ

మాడుగుల: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్య నారాయణ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఈ నరసింగరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు



ఏఎల్‌పురంలో ప్రచారం చేస్తున్న దృశ్యం

గొలుగొండ: బాల్య వివాహాలు వద్దు.. చదువులు ముద్దు అంటూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏఎల్‌పురం వారపు సంతలో కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు బుర్రకథ రూపంలో ప్రదర్శించి బాల్య వివాహాలు వల్ల కలిగే కష్టాలు గురించి ప్రజలకు వివరించారు. బాల్య వివాహాలపై ప్రతీ గ్రామంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లోచల సుజాత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్యశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా వినాయక ఆలయ నిర్మాణం



వినాయక ఆలయ నిర్మాణ పనులు

మాడుగుల రూరల్: కె.జె.పురం హౌసింగ్ కాలనీలో వరసిద్ధి వినాయక ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామంలో ఆధ్యాత్మికతను ప్రతిబింబిస్తూ పలు ఆలయాలు వెలిశాయి. ఆయా ఆలయాల్లో నిత్యం పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా హౌసింగ్ కాలనీలో దాతలు, ప్రజలు, కాలనీవాసులు సహకారంతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. దాతలు విరాళాలు అందజేసి, ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

మట్టవానిపాలెంలో సారె ఊరేగింపు



సారె ఊరేగింపులో భక్తులు

రావికమతం: మట్టవానిపాలెంలో మంగళవారం పరదేశమ్మతల్లి పండుగ ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా అమ్మవారి మాలధారణ భక్తులు వంద మందికి పైగా నిత్యం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గ్రామంలో సోమవారం కలశాలతో సారె ఊరేగింపు నిర్వహించారు.

కన్నంపాలెంలో శ్రీకృష్ణుడి ఆలయం ప్రారంభం



పూజలు చేస్తున్న ధర్మశ్రీ

చోడవరం: కన్నంపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుడి ఆలయాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం ప్రారంభించారు. రూ. 20 లక్షలు మంజూరు కాగా, మరికొంత నిధులు గ్రామస్తులు సమకూర్చుకొని ఈ ఆలయాన్ని నిర్మించారు. ఏకశిల విగ్రహాలను ప్రతిష్ఠించారు. భజన బృందాల చిటికెల భజనలు, మంగళవాయిద్యాలు, పండితుల వేద మంత్రాల మధ్య ఆలయ ప్రారంభోత్సవం కనుల పండువగా జరిగింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని పూజలు చేశారు. వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు పాల్గొన్నారు.

లేటయినా... లేటెస్ట్‌గా సీసీరోడ్డు

- చోడవరంలో 7 మీటర్ల వెడల్పుతో నిర్మాణం
- పటిష్టత కోసం ఇనుప ఊచల వినియోగం
- వెంకన్నపాలెం నుంచి వడ్డాది జంక్షన్ వరకు బీటీరోడ్డు పనులు



పటిష్టంగా నిర్మితమవుతున్న సీసీ రోడ్డు



ముందుగా వేసిన సాధారణ సీసీరోడ్డు



అడుగు దళసరి సీసీరోడ్డు నిర్మాణంలో వాడుతున్న ఐరన్ ఊచలు

చోడవరం రూరల్: నియోజకవర్గంలో భీముని పట్నం–నర్సీపట్నం(బీఎస్)రోడ్డు దుస్థితిపై ఐదేళ్ల పాలనలో మీనమేషాలు లెక్కించిన టీడీపీ నేతలు ఇప్పుడు దాన్ని ఆయుధంగా చేసుకుని అధికార పార్టీపై విమర్శలు గుప్పిస్తున్నారు. వారి నోళ్లు మూయించేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్టంగా నిర్మిస్తోంది. జాతీయ అభివృద్ధి బ్యాంకు (ఎన్‌డీబీ) నిధులతో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి బీఎస్‌రోడ్డు నిర్మాణాన్ని చేపడుతోంది.

ఇందులో భాగంగా ఆయా గ్రామాల పరిధిలో తారు రోడ్డయితే తడుపరి వర్షాలు, ఆవాసాల నుంచి వచ్చే వాడుక నీరు కారణంగా తిరిగి మరమ్మతుల పాలయ్యే వీలున్నందున సిమెంట్ రోడ్డు, దానికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మించడానికి ప్రణాళిక రూపొందించింది. చోడవరం పట్టణంలో ఈ రీతిన 1,840 మీటర్ల పరిధిలో సీసీరోడ్డు నిర్మాణం చేయనున్నారు. పట్టణంలోని కొత్తూరు జంక్షన్ నుంచి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ క్యాంపు కార్యాలయం వరకు 7 మీటర్ల వెడల్పున సిమెంట్ రోడ్డును 800 మీటర్ల మేర నిర్మిస్తారు. నర్సీపట్నం వైపున ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి నర్సయ్యపేట దరి వంతెన వరకు 1,040 మీటర్ల పొడవున సిమెంట్ రోడ్డును సీసీ డ్రైనేజీలను నిర్మించడానికి ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ఇప్పటికే తొలి విడతగా సాధారణ సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. రోడ్డుపై నిత్యం రాకపోకల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసిన కన్సల్టెంట్ సంస్థ డిజైన్ ప్రకారం పటిష్ట సీసీరోడ్డును నిర్మిస్తున్నారు. సిమెంట్ రోడ్డును ఒక అడుగు మందంతో ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు వేసవి రోజుల్లో వ్యాకోచ, సంకోచాలకు గురయ్యే వీలున్నందున దీన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి గాను అడ్డం వరుసలో పది ఎం.ఎం. నిలువు వరుసలో 20 ఎం.ఎం ఇనుప ఊచలను వాడుతున్నారు. ఇది భవిష్యత్‌లో రోడ్డుపై జరిగే వాహనాల రాకపోకల రద్దీని సైతం తట్టుకోగలదని ఇంజనీరింగ్ నిపుణుల అభిప్రాయం. ఈ రోడ్డు నిర్మాణ పనులు ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటున్నాయి. ముందుగా కొత్తూరు జంక్షన్‌లో ఒక వైపున మూడున్నర మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఇది పూర్తయ్యాక పక్కగా మరో మూడున్నర మీటర్ల వెడల్పున రోడ్డు నిర్మిస్తారు. బీఎస్ రోడ్డులో మండలంలోని వెంకన్నపాలెం జంక్షన్ నుంచి బుచ్చియ్యపేట మండలం వడ్డాది జంక్షన్ వరకు 10.2 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి రూ.32 కోట్లతో అంచనాలు తయారు చేశారు. ఈ రోడ్డు ఏడు మీటర్ల వెడల్పున నిర్మించనున్నారు. ఈ మధ్యలో కల్వర్టులు, వంతెనలను పూర్తి చేస్తారు. దీంతో బీఎస్ రోడ్డు కష్టాలు తీరినట్టే.

రూ.32 కోట్లతో రోడ్డు నిర్మాణం

చోడవరం సెక్షన్ పరిధిలో రూ.32 కోట్లతో రోడ్డు నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలు ఉన్నాయి. వెంకన్నపాలెం జంక్షన్ నుంచి వడ్డాది జంక్షన్ వరకు 10.2 కిలోమీటర్ల మేర రోడ్డును 7 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తాం. గ్రామాల పరిధిలో సీసీరోడ్డు, డ్రైనేజీలు నిర్మించడం ద్వారా రోడ్డు పాడవకుండా చర్యలు తీసుకోనున్నాం. ఈ రోడ్డు డిజైనులో ప్రత్యేక కన్సల్టెన్సీ సూచనల మేరకే పనులు చేపడతాం

– జె.సత్యప్రసాద్,
జేఈ, ఆర్‌అండ్‌బీ, చోడవరం సెక్షన్

ఘనంగా దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న విప్ ధర్మశ్రీ, నాయకులు



అన్నసమారాధనలో పాల్గొన్న విప్ ధర్మశ్రీ

- అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: మండల శివారు పంచాయతీ నీలకంఠాపురంలో దుర్గాలమ్మ ఆలయ విగ్రహ, కలశ స్థాపన ప్రతిష్ట కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాల సాక్షిగా ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామస్తులతోపాటు రాజాం, పెదమదీన, తైపురం, ఆర్. శివరాంపురం, భీమవరం, కందిపూడి తదితర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ పడాల నాగభూషణం తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి కోలాటాలు, భక్తి భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి.

సిటీ క్లబ్ అక్రమ నిర్మాణాలపై ఆర్డీవో ఆగ్రహం

- తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ కమిషనర్‌కు ఆదేశం



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: సిటీ క్లబ్ ఆవరణలో అక్రమ నిర్మాణాలపై ఏమి చేస్తున్నారంటూ ఆర్డీవో హెచ్.వి.జయరాం కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూకు చెందిన సిటీ క్లబ్ ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మించిన షాపుల సముదాయాన్ని తొలగించి, సిటీ క్లబ్ కమిటీపై చర్యలు తీసుకోవాలని నర్సీపట్నానికి చెందిన పాకలపాటి అరవిందుకుమార్, కాళ్ల లోవరాజు స్పందనలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్‌ను ఆర్డీవో ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చామని కమిషనర్ బదులిచ్చారు. నోటీసులతో చేతులు దులుపుకుంటే సరిపోతుందా.. చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదా అని ఆగ్రహించారు. తక్షణమే అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాతవరం మండలం, గుమ్మిడికొండ గ్రామ రెవెన్యూ పరిధిలో తన భార్య రుత్తల శేషుకుమారి పేరున ఐదెకరాల భూమిని ఆన్‌లైన్లో వేరొకరి పేరున మార్చేశారని ఆర్.పి.రాజుబాబు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. గొలుగొండ మండలం జోగంపేట గ్రామానికి చెందిన 51 మంది దళితలకు కోటవురట్ల మండలం పందూరు రెవెన్యూ భూములు ఇచ్చారు. దళితులు, అక్రమణదారుల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో ఆ భూముల్లోకి ఎవరినీ వెళ్లొద్దని అధికారులు సూచించినప్పటికీ, అక్రమణదారులు దర్జాగా అనుభవిస్తున్నారని భూ బాధితుడు జువ్వల వరహాలబాబు ఫిర్యాదు చేశాడు. వారిపై చర్యలు తీసుకోకపోతే తమ భూముల్లోకి వెళ్తామని బాధితుడు ఆర్డీవోకు వివరించాడు. సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుని దళితులకు న్యాయం చేయాలని కోరాడు. వివిధ సమస్యలపై 19 అర్జీలు వచ్చాయి.

భూసారం పెంపుపై రైతుల దృష్టి



పొలాల్లో గొర్రెల మంద

కె.కోటపాడు: గ్రామాల్లో రైతులు సాగు భూములను మరింత సారవంతంగా మార్చేందుకు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా భూసార పరీక్షలు చేయిస్తున్నారు. తద్వారా వచ్చిన భూసార నివేదికలను అనుసరించి ఆయా పొలాల్లో సారవంతం పెంపుపై పలు అధునాతన పద్ధతులను అవలంబిస్తున్నారు. పచ్చిరొట్ట, వంటివి సాగు చేస్తున్నారు. పొలాల్లో మేకల మందలను ఉంచడంతోపాటు పశువుల మూత్రం, పేడతో వచ్చిన ఎరువులను భూమిలో కలియ దున్నే చర్యలు చేపడుతున్నారు. తద్వారా ఆయా పొలాలు మరింత సారవంతంగా మారి పంటలు ఆరోగ్యకరంగాను, మంచి దిగుబడి వచ్చేవిధంగా ఉంటాయని చెబుతున్నారు.

యువత దేశభక్తిని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ముత్యాలనాయుడు

అచ్యుతాపురం : యువత దేశభక్తిని అలవర్చుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వపు ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నైబర్ హుడ్ పార్లమెంట్‌లో భాగంగా ఆయన మట్లాడారు. జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి గొర్లె మహేశ్వరరావు కార్యక్రమ ప్రాధాన్యాన్ని వివరించారు. బార్క్ సైంటిస్ట్ ఎం.వి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నాతవరం డిప్యూటీ తహసీల్దార్‌గా సురేష్

నాతవరం: ఎన్నికల బదిలీల్లో భాగంగా నాతవరం డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్.సురేష్‌ను నియమించడంతో సోమవారం విధుల్లోకి చేరారు. ఆయన ఇంతవరకు దేవరాపల్లి మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ సి.వి. చైన్లును నక్కపల్లి బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన డిప్యూటీ తహసీల్దార్‌ను ఆర్ఐ హరి, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, మండల సర్వేయరు బాలరెడ్డి, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మాడుగుల డీటీగా లక్ష్మయ్య



డీటీ లక్ష్మయ్య

మాడుగుల: డిప్యూటీ తహసీల్దారుగా డి. లక్ష్మయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. చోడవరం తహసీల్దారు కార్యాలయంలో డీటీగా పనిచేసిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డీటీ సత్యనారాయణ చోడవరం బదిలీపై వెళ్లారు.

ఘనంగా రమా సత్యనారాయణస్వామి తీర్థం

కె.కోటపాడు: ఆనందపురంలో సోమవారం రమా సత్యనారాయణస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడిగా మారింది. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ వంటాకు అప్పాజి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయండి

మాడుగుల రూరల్: వచ్చే నెల 3న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి కిల్లో మాలంనాయుడు కోరారు. సోమవారం కింతలి పీహెచ్‌సీ ఆవరణలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బందితో ఆయన సమీక్షించారు. పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు కలిగిన 2,326 మందికి చుక్కలు మందు వేస్తామన్నారు. ఇందుకోసం 27 బూత్‌లు ఏర్పాటు, 108 మంది సిబ్బందిని నియమించామన్నారు. రెండు రూట్లుగా విభజించామని, మొబైల్ టీమ్ అందుబాటులో ఉంచామన్నారు. అదే రోజు పోలియో చుక్కలు వేసుకోలేని వారిని గుర్తించి 4, 5, తేదీల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వేస్తారన్నారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల పందెం

బుచ్చెయ్యపేట: జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు మంగళవారం బుచ్చెయ్యపేటలో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఇక్కడ ఆంజనేయస్వామి తీర్థం మహోత్సవం సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ముగ్గులు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో 28న జాబ్‌మేళా

అనకాపల్లి : రేబాక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఈనెల 28న మూడు కంపెనీలతో మినీ జాబ్‌మేళా ఉదయం 10 నుంచి 4 గంటల వరకూ నిర్వహిస్తున్నట్టు సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసుకుని, 18 నుంచి 35 సంవత్సరాలు నిరుద్యోగులు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ నాగేంద్ర, ఎంఈవో పడాల్‌దాస్, రమణ

దేవరాపల్లి: ప్రణాళిక బద్ధంగా చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్‌ఐ డి. నాగేంద్ర ఆకాంక్షించారు. ఎం. అలమండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దేవరాపల్లికి చెందిన బాలు రెడీమేడ్ బట్టల షాపు యజమానులు బాలు, సుప్రీమ్ పరీక్ష మెటీరియల్‌ను సమకూర్చారు. వీటి ఎస్‌ఐ, ఎంఈవో–1 బి. పడాల్ దాస్, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కె.వి.రమణ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండలాధ్యక్షుడు కొరుపాలు శ్రీను సోమవారం పంపిణీ చేశారు. కె.వి.రమణ మాట్లాడుతూ ఇంగ్లిష్ మీడియం విద్యా బోధనతో ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడుతో కార్పొరేట్‌కు దీటుగా సదుపాయాలు కల్పించారన్నారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు బత్తి శ్రీనివాస్ కుమార్, నౌడు అప్పారావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

126 మందికి వైద్య పరీక్షలు



కొండయ్యపాలెంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శకుంతల

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా సోమవారం చింతపాలెంలో వైద్య శిబిరం నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ డాక్టరు నిర్మల 126 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, డి.ఎస్.ఎన్.రాజు, రమణ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండయ్యపాలెంలో..

మాడుగుల రూరల్: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా పోతనపూడి పంచాయతీ శివారు కొండయ్యపాలెంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వడ్డాది పీహెచ్‌సీ డాక్టరు సిహెచ్. వి.శకుంతల వంద మందికి వైద్య సేవలందించారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం యూపీ పాఠశాల విద్యార్థులను, అంగన్‌వాడీ చిన్నారులను పరీక్షించారు. ఆరోగ్య జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం, ఎం.ఎల్.హెచ్.పి, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

కొమరవోలు ఆవ గట్టు ధ్వంసం

- అధికారులకు ఉపాధి కూలీల ఫిర్యాదు



ఎంపీడీవోకి ఫిర్యాదు చేసిన ఉపాధి కూలీలు

రోలుగుంట: కొమరవోలు ఆవలో పని చేస్తున్న ఉపాధి కూలీలు వీఆర్పీతో కలసి ఎస్సై ఎల్.సురేష్, ఎంపీడీవో వెంకటేశ్వర్రావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. నాలుగు సంవత్సరాలుగా కొమరవోలు ఆవలో గ్రామానికి చెందిన 300కిపైగా కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఆవను కొంత మంది రైతులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్ఈఆర్ఈజీఎస్ అధికారుల ఆదేశాల మేరకు వీఆర్పీ ఇచ్చిన కొలతలననుసరించి ఉపాధి పనులు చేస్తున్నారు. మూడేళ్ల క్రితం రోలుగుంట రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి వెళ్లగా రైతుతో మాట్లాడి సరిహద్దులు ఏర్పాటు చేయడంతో ఉపాధి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు వారాలుగా ఇక్కడ వీఆర్పీ సూచనతో ఆవ గట్టు పనులు చేస్తున్నారు. సోమవారం సదరు రైతులు పొక్లెయిన్‌తో గట్టును తొలగించేశారు. గట్టు లేకపోవడంతో చేసిన పనులకు బిల్లు పెట్టలేమని వీఆర్పీ చేతులెత్తేశారు. ఈ విషయాన్ని ఏపీవో సూర్యామణికి ఫోన్లో విన్నవించగా, వీఆర్పీ కొలతల మేరకే బిల్లులు చెల్లిస్తామన్నారు. దాంతో గట్టు ధ్వంసం చేసిన రైతులపై వేతనదారులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై మాట్లాడుతూ భూసమస్య తన వద్ద కాకుండా తహసీల్దార్, ఎస్ఆర్ఈజీఎస్ అధికారుల వద్ద పరిష్కరించుకోవాలని సూచించారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ సమస్య పరిష్కరిస్తామని, అప్పటి వరకూ వేరొక పని కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

బాలికలపై దాడులను అరికట్టాలి



మంగళాపురంలో అవగాహన కల్పిస్తున్న కళాజాతా సిబ్బంది

బుచ్చెయ్యపేట: బాలికలపై ఇంటా, బయట దాడులను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని ఐసీడీఎస్ సీడీపీవో పుష్ప తెలిపారు. సోమవారం మంగళాపురంలో బాలికల చదువు, సంరక్షణపై కళాజాతా ద్వారా గర్భిణులకు, బాలింతలకు, బాలికలకు అవగాహన కల్పించారు. బాలికల పట్ల చిన్న చూపు తగదు, వారిని చదివిద్దాం, రక్షిద్దాం, బాల్య వివాహాలను నిర్మూలిద్దాం, భ్రూణహత్యలు, విద్య ప్రాముఖ్యత, మహిళలల అక్రమ రవాణాపై కళాజాతా సిబ్బంది అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతంలో తల్లిదండ్రులు ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలని, ఇద్దరి ఉన్నత చదువులకు ప్రాముఖ్యత కల్పించాలని సర్పంచ్ కంటే పద్మరేఖ వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాజరాజేశ్వరి, మహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ రాధ పాల్గొన్నారు.

95 మందికి హృద్రోగ పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్

చోడవరం రూరల్: స్థానిక సంజీవనీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన గుండె వైద్య ఉచిత శిబిరంలో 95 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. వీరికి విశాఖ మెడికవర్ వైద్య బృందం ఆదారి చంద్రశేఖర్, గండి నిరుపమ, కార్డియాలజీ డాక్టర్ సిహెచ్.ఎస్.రాజు, జనరల్ ఫిజీషియన్ త్రిలోక్ చంద్, డాక్టర్ భువన పరీక్షలు చేశారు. వీరిలో 35 మందికి 2డి ఎకో, 47 మందికి ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేశారు. ఇతర రోగులకు గుండె సంబంధ పరీక్షలు చేసి తగు మందులను సూచించారు. శిబిర నిర్వహణలో ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్ కాళ్ల హరీష్ సహకరించారు.

ఆధునిక పరిజ్ఞానంతో చెరకులో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న ముకుందరావు

అనకాపల్లి : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతులు ఉపయోగించడం ద్వారా చెరకులో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌ఛార్జ్ ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో విశాఖ ఆత్మావారి సౌజన్యంతో యువరైతులకు వారంరోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చెరకు సాగులో ఒంటికన్ను ముచ్చులును విత్తనంగా ఉపయోగించడం ద్వారా చెరకుసాగులో ఖర్చు తగ్గించు కోవడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ చెరకులో ఆదునిక వంగడాలు, ఆదునిక పద్ధతులను ఆచరించటం ద్వారా చెరకు రైతులు ఆర్థికంగా బలపడతారన్నారు. చెరకులో ఒంటి కన్ను ముచ్చెలు, జంటచాళ్ల పద్ధతిలో అంతర పంటల సాగు, డ్రిప్ ఇరిగేషన్ విధానం, కలుపునివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా చెరకు 25శాతం అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కెవి.రమణమూర్తి, విశాలాక్షి , ఉమామహేశ్వరరావు, సీతారామలక్ష్మి, చోడవరం చెరకు కర్మాగారం పరిధిలోని 10మంది యువ చెరకు రైతులు పాల్గొన్నారు.

కె.జె.పురంలో తీర్థం నేడు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో దివగంత కర్రి రామునాయుడు విగ్రహం వద్ద మంగళవారం తీర్థం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు.